నిందితులను కఠినంగా శిక్షించాలి



కోల్‌కతా వైద్యురాలిపై లైంగిక దాడి నిందితులను కఠినంగా శిక్షించాలి. వైద్యులంటే ప్రాణాలను కాపాడేవారని ప్రజలంతా నమ్ముతారు. అలాంటి మహిళా వైద్యులపై దుర్మార్గపు చర్యలకు పాల్పడటం హేయమైన చర్య. భవిష్యత్‌లో ఎవరూ ఇటువంటి చర్యలకు పాల్పడకుండా నిందితులను దేశమంతా ఉలిక్కిపడేలా కఠినమైన శిక్షలు వెంటనే విధించాలి. కాపాడే వైద్య వృత్తిలో ఉన్న మహిళలపై అఘాత్యాలకు పాల్పడే దుర్మార్గులను సమాజం నుంచి వెలివేయాలి.
– డాక్టర్ బ్యంగా లక్ష్మి ప్రసన్న, ఉప్పలపాడు పీహెచ్‌సీ వైద్యురాలు



దాడి హేయం



కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్య దారుణం. సభ్యసమాజం తలదించుకునే ఘటన. వైద్య వృత్తిలో అందరి ప్రాణాలు కాపాడాలని ఆకాంక్షించే వైద్యులకే రక్షణ లేకపోతే ఎలా.. ప్రస్తుత చట్టాలు ఇలాంటి దాడుల నుంచి కాపాడడంలో విఫలమవుతున్నాయి. ఆ ఘటనతో వైద్య లోకం నివ్వెరపోయింది. ఒకరకమైన భయం ఏర్పడింది. సేవలు అందించేందుకు కూడా భయపడుతున్నారు. ఇలాంటి ఘటనలపై ప్రభుత్వాలు సీరియస్‌గా స్పందించాలి. అవసరమైన చట్టాలు తీసుకురావాలి.
– డాక్టర్ సి.యానీగ్రేస్, నుదురుపాడు పీహెచ్‌సీ వైద్యురాలు

క్లుప్తంగా

నగర పంచాయతీ కమిషనర్ చెన్నయ్య బాధ్యతలు స్వీకారం



గురజాల: నగర పంచాయతీ కమిషనర్‌గా కె.చెన్నయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు కమిషనర్‌గా విధులు నిర్వహించిన అన్నదాత మోహన్ శ్రీనివాస్ హిందూపురం మేనేజర్‌గా బదిలీపై వెళ్లారు. కె.చెన్నయ్య చిత్తూరు కార్పొరేషన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా గురజాల నగర పంచాయతీ కమిషనర్‌గా వచ్చారు. బాధ్యతలు నిర్వహించిన చెన్నయ్యకు నగర పంచాయతీ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పంట కోత ప్రయోగంపై శిక్షణ



గురజాల: పంట కోత ప్రయోగంపై మండల వ్యవసాయ శాఖ సిబ్బందికి బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎస్ఓ ఆయూబ్ మాట్లాడుతూ పంట కోత ప్రయోగం వలన ఎన్నో లాభాలు ఉన్నాయన్నారు. పంట కోత ప్రయోగం ప్రాముఖ్యతను వివరించారు. యాక్షన్ ప్లాన్ ప్రకారం మండలంలో జనరల్ పంట కోత ప్రయోగాలు ప్రత్తి 6, మిరప 3, వరి 6 వచ్చాయన్నారు. పంట కోత ప్రయోగాలను వ్యవసాయ శాఖ సిబ్బంది చాలా జాగ్రత్తగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ రామనారాయణ, వ్యవసాయాధికారిణి ఎం.సంధ్యారాణి తదితరులున్నారు.

బాలికలు అప్రమత్తంగా ఉండాలి



వెల్దుర్తి: దేశంలో జరుగుతున్న అరాచకాలపై బాలికలు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఎం.సత్యనారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన వెల్దుర్తి లోని కస్తూర్బా గాంధీ బాలికోన్నత పాఠశాలలో ఉమెన్ సేఫ్టీపై విద్యార్థినులకు అవగాహన కల్పించి మాట్లాడారు. విద్యార్థినులు అన్నీ విషయాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యతో పాటు అన్నీ రంగాల్లో ముందుండాలన్నారు. అనుమానితులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అరాచకాలపై అవగాహన కలిగి ఉండి సురక్షితంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

వెల్దుర్తి: రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని శిరిగిరిపాడు బస్టాండ్‌లో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనాలు వచ్చిపోయేటప్పుడు జాగ్రత్తగా రోడ్లను దాటాలన్నారు. చోదకులు నిబంధనల ప్రకారం వాహనాలు నడపాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చర్మకారులకు పింఛన్‌లు అందించండి



మాచర్ల రూరల్: చేతివృత్తి పైనే జీవనం సాగిస్తూ ప్రభుత్వ పథకాలు అందక ఇబ్బంది పడుతున్న చర్మ, డప్పు కళాకారులకు పెన్షన్‌ను అందించాలని బాబూ జగ్జీవన్‌రామ్ చర్మకారుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈమేరకు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. సంఘం నాయకులు కె.రవి కుమార్, మాచర్ల కాశయ్యలు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి చెప్పులు కుట్టుకుంటూ, డప్పు వాయించుకుంటూ జీవనం కొనసాగించుకుంటున్న చర్మకారుల్లో అర్హులను గుర్తించి పింఛన్ మంజూరు చేయాలని కోరామన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

రాజుపాలెం: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కృష్ణకుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు ఆయన బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. నీరసంగా ఉన్న వారికి మందుల్ని అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ జ్వరం వచ్చిన వెంటనే అశ్రద్ధ చేయకుండా ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. గదుల్లో దోమలు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

చవితికి కొలువుతీరిన గణనాథులు

- పట్టణంలో జోరుగా తయారీ
- విగ్రహాల తయారీలో ప్రతిభ చూపుతున్న రాజస్థాన్‌వాసులు



వినాయక బొమ్మలకు తుది మెరుగులు దిద్దుతున్న కళాకారుడు

మాచర్ల రూరల్: వినాయక చవితి సందడి మొదలైంది. వాడవాడలా వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించనున్నారు. సెప్టెంబర్ 7వ తేదీ గణనాథుడి ఉత్సవాలకు కళాకారులు ప్రతిమలను సిద్ధం చేస్తున్నారు. నవరాత్రులను పురస్కరించుకుని బొజ్జ గణపయ్యను వేదికపై అలంకరించేందుకు తయారీదారులు తుదిమెరుగులు దిద్దుతున్నారు. మూషిక వాహనం, గరుడ, అశ్వ, మయూర, గోవు, కాణిపాకం, పార్వతీ పరమేశ్వర్లుతో గణనాథుల విగ్రహాలను వివిధ రూపాలలో తయారు జోరుగా సాగుతుంది. 4 అడుగుల నుంచి 12 అడుగుల వరకు విగ్రహాలను తయారుచేస్తున్నారు.

పట్టణ, శివారులలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, ఆర్టీసీ గ్యారేజి ఎదురుగా ఉన్న గణేష్ విగ్రహాల తయారీ కేంద్రంలో విక్రయాలను జరుపుతున్నారు. ఈ కేంద్రాలలో సుమారు 650కి పైగా వివిధ రూపాల్లో గణనాథుని ప్రతిమలు తయారై అమ్మకాలకు సిద్ధంగా ఉన్నాయి. 4 అడుగుల విగ్రహం రూ.5 వేల నుంచి మొదలై 12 అడుగుల విగ్రహం సుమారు రూ.40 వేల వరకు అమ్మకాలు జరుపుతున్నారు.

విగ్రహాల తయారీలో రాజస్థాన్ కుటుంబాలు..

విగ్రహాల తయారీలో రాజస్థాన్‌కు చెందిన తులసీరామ్ కుటుంబం 30 మందికి పైగా కళాకారుల



సిద్ధంగా వినాయకుని విగ్రహాలు

నైపుణ్యంతో విగ్రహాల తయారు చేస్తున్నారు. ఇదే వృత్తిగా జీవనం సాగిస్తూ విగ్రహాల రూపకల్పనలో వైట్ సెమ్ మిశ్రమం, కొబ్బరిపీచు, అద్దకపు రంగులతో అందమైన రూపాలలో విగ్రహాలు తయారు చేస్తున్నారు. ఆర్టీసీ గ్యారేజి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో శిబిరాలు ఏర్పాటు చేసుకొని ఇంటిల్లిపాది బొమ్మలు తయారు చేస్తున్నారు. విగ్రహాల తయారీలో పర్యావరణానికి హాని కలగని విధంగా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు కళాకారులు చెబుతున్నారు. సహజమైన అద్దకపు రంగులు వినియోగించటంతో కాలుష్యం ఉండదంటున్నారు. ఐదేళ్ళ నుంచి విగ్రహాల అమ్మకం బాగానే ఉందని చెప్పారు. విగ్రహాల కొనుగోలు కోసం కమిటీ సభ్యులు, చిన్నారులు, దేవాలయ ధర్మకర్తలు ఇప్పటికే అడ్వాన్సులు అందించి విగ్రహాలను కొనుగోలు చేసినట్లు వారు పేర్కొన్నారు.

సస్యరక్షణతోనే అధిక దిగుబడులు



పత్తి పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో రైతులు సాగు చేసిన పత్తి పంటలో పచ్చదోమ, రసంపీల్చు పురుగులైన ముడత కనిపిస్తుందని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని తుమృకోట గ్రామ శివార్లోని పత్తి పంటను పరిశీలించారు. పచ్చదోమ, తామర పురుగు నివారణకు ఒక లీటర్ నీటికి వేపనూనె 5.0 గ్రాములు లేదా 1.5 గ్రాముల లెసిఫేట్‌ను లేదా కాన్ఫిడార్ 0.4 ఎంఎల్ కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. 50 నుంచి 60 రోజుల పత్తి పంటలో ఎకరాకు 4 నుంచి 6 లింగాకర్షణ బుట్టలను అమర్చుకుని రెక్కల పురుగుల ఉధృతిని నివారించవచ్చునన్నారు. ఒక్కొక్క బుట్టలో 8 రెక్కల పురుగుల చొప్పున రెండు, మూడు రోజులు వరసగా పడిన 10 పత్తి పువ్వులకు ఒక గుడ్డి పువ్వు, 10 కాయలకు ఒక పుచ్చుకాయ గమనించిన వెంటనే క్లోరిపైరిఫాస్ 2.5 ఎంఎల్ లేదా లార్విన్ 1.2 గ్రాములు లేదా ప్రొఫెనోఫాస్ 2 ఎంఎల్ ఒకలీటర్ నీటితో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. గూడ, పూల రాలకుండా 60 రోజులు నుంచి 90 రోజులు పత్తి పంటకు ఒకసారి 1.5 గ్రాములు బొరాక్స్‌పొడిని ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకుని నివారించవచ్చన్నారు. పత్తిలో ఎర పంటలుగా ఆముదం, బంతి మొక్కలను అక్కడక్కడ వేయడం వలన మేలు జరుగుతుందన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న ఎంపీడీవో ఫణికుమార్ నాయక్

గురజాల: సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో అప్రమత్తత అవసరమని ఎంపీడీఓ ఆర్.ఫణికుమార్ నాయక్ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిషత్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో విషజ్వరాలు అధికంగా ఉన్నాయన్నారు. చేపట్టవల్సిన అభివృద్ధి పనులు గురించి చర్చించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలు గురించి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు చర్చించారు. ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, చల్లా వెంకటేశ్వర్లు, కో–ఆప్షన్ మెంబర్ షేక్ పీర్ అహ్మద్ తదితరులున్నారు.

ముక్త్యాలరాజాకు ఘన నివాళి



ముక్త్యాలరాజా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కేసీపీ సీనియర్ జనరల్ మేనేజర్ వెంకటరమణ

విజయపురిసౌత్: ముక్త్యాలరాజా వర్ధంతి కార్యక్రమాన్ని విజయపురిసౌత్ లోని పార్క్ సెంటర్‌లో కేసీపీ సిమెంట్ ఫ్యాక్టరీ ఉద్యోగుల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. తొలుత ముక్త్యాలరాజా విగ్రహానికి సీనియర్ జనరల్ మేనేజర్ వి.వెంకటరమణ కొబ్బరికాయలు కొట్టి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి మూల పురుషుడు ముక్త్యాల రాజా అని కొనియాడారు. ఆనాడు బంజరు భూములుగా ఉన్న పొలాలు నేడు సిరులు పండిచే భూములుగా మారటానికి ఆయన చేసిన విశేష కృషేనని తెలిపారు. సర్ ఆర్థర్ కాటన్ చెప్పినట్లు నీరు ద్రవ రూపంలో ఉన్న బంగారం అనే సూక్తిని బలంగా నమ్మిన వ్యక్తి ముక్త్యాలరాజా అని అన్నారు. తన సొంత నిధులను వెచ్చించి ఖోస్లా కమిటీకి సాగర్ డ్యాం ప్లాన్, అడవిలో రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేసి ప్రాజెక్టు నిర్మాణానికి మార్గం సుగమం చేశారన్నారు. కార్యక్రమంలో కేసీపీ సీనియర్ డీజీఎంలు కె.రామకోటేశ్వరరావు, కె.ఆనందరెడ్డి, హెచ్‌ఓడి జి.శ్రీనివాసరావు, వెల్ఫేర్ ఆఫీసర్ సిహెచ్ శ్రీనివాసరావు,ఐఎన్టీయుసి యూనియన్ ప్రెసిడెంట్ ఓ.శివయ్య, యూనియన్ జనరల్ సెక్రటరీ జీఎల్ నారాయణ పాల్గొన్నారు.

న్యూటన్స్ కళాశాలకు నాక్ బి ప్లస్ ప్లస్ గ్రేడ్



సర్టిఫికెట్‌ను చూపుతున్న కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు

మాచర్ల రూరల్: న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాల ఆధునిక, సాంకేతిక విద్యను అందించటంతో పాటు విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనలో న్యూటన్స్ యాజమాన్యం తీసుకుంటున్న చర్యలను గమనించి జాతీయ బృందం నాక్ బి ప్లస్ ప్లస్ గ్రేడ్ సర్టిఫికెట్‌లను అందించినట్లు కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత నెల 25,26వ తేదీలలో రెండు రోజుల పాటు న్యూఢిల్లీకి చెందిన నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కమిటీ కళాశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలు రీసెర్చ్ డెవలప్‌మెంట్ సెల్ పరీక్ష కేంద్రం, గ్రంథాలయం, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ సదుపాయాలను పరిశీలించారు. ఈ నేపథ్యంలో బృందం సభ్యులు వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను గుర్తించి జాతీయస్థాయిలో నాక్ బి ప్లస్ ప్లస్ గ్రేడ్‌ను అందించినట్లు ఆయన చెప్పారు. కళాశాలకు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ గుర్తింపు రావటం ఆనందకరమని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్‌రెడ్డి, హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులను ఆయన అభినందించారు.

రంగురాళ్లు, వజ్రాల వేట మానుకోకుంటే చర్యలు



రాళ్లు ఏరుకుంటున్న వారికి కౌన్సెలింగ్ చేస్తున్న ఎస్ఐ సీహెచ్.సురేష్

నకరికల్లు: ప్రభుత్వ భూముల్లో రంగురాళ్లు, వజ్రాల కోసం వెతుకులాడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సీహెచ్ సురేష్ హెచ్చరించారు. మండలంలోని త్రిపురాపురం గ్రామ సమీపంలోని కొండ పరిసర ప్రాంతాలను బుధవారం పరిశీలించారు. రాళ్లు ఏరుకుంటూ ఆ ప్రాంతంలో గుంపులు గుంపులుగా ఉన్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకరికల్లు పరిసర ప్రాంతాల్లో రంగురాళ్లు దొరుకుతున్నాయని వాట్సాప్, ఫేస్‌బుక్, యూట్యూబ్ లాంటి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్న కథనాలు నమ్మి మోసపోవద్దన్నారు. రంగురాళ్లు, వజ్రాలు దొరుకుతున్నాయన్నది పూర్తి అవాస్తవమన్నారు. అత్యాశకు పోయి దూరప్రాంతాల నుంచి వచ్చి అనర్థాలు కొని తెచ్చుకోవద్దని హితవు పలికారు.

దాడి కేసులో ముగ్గురి అరెస్టు



స్థల వివాదంతో పరస్పరం దాడి చేసుకుంటున్న రెండు వర్గాలు

అమరావతి: మండల పరిధిలోని లేమల్లె ముస్లిం కాలనీలో రెండు రోజుల కిందట బంధువుల మధ్య జరిగిన స్థల వివాదంలో పరస్పరం దాడి చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగు లోకి వచ్చింది.ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం...స్థల వివాదంలో బంధువులైన షేక్ ఫైగంబర్, షేక్ అబ్దుల్లాలు రెండు వర్గాలుగా ఏర్పడి పరస్పరం దాడి చేసుకున్నారు. ఇందులో అబ్దుల్లా తలకు బలమైన గాయమైంది. గుంటూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు ఈ సంఘటనలో అమరావతి పోలీసులు షేక్ ఫైగంబర్, అతని కుమారులు మహ్మద్‌రఫీ, ఈసావలీలపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. అబ్దుల్లా వర్గంలోనూ ఏడుగురిపై కేసు నమోదు చేశారు. హత్యాయత్నం కేసులో బుధవారం షేక్ ఫైగంబర్, అతని కుమారులను అరెస్టు చేసి సత్తెనపల్లి కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ ప్రసాదరెడ్డి తెలిపారు. రెండో కేసులో ముద్దాయిలను కూడా త్వరలో అరెస్టు చేస్తామని ఆయన చెప్పారు.

కొనసాగుతున్న వైద్య శిబిరాలు

క్రోసూరు: గ్రామాల్లో ప్రజలు జ్వరాల బారినపడుతున్న దృష్ట్యా మండలంలోని ఊటుకూరు, బయ్యవరం గ్రామాల్లో వైద్యశిబిరాలు కొనసాగుతున్నట్లు ఎంఎల్‌హెచ్‌పీ శివుడు బుధవారం తెలిపారు.ఊటుకూరులో 15 మందికి, బయ్యవరంలో 60 మందికి పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. బయ్యవరంలో 104 సంచార వైద్యశాల నిర్వహించగా డాక్టర్ సిరిచందన పాల్గొన్నారు. ఊటుకూరులో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

చెంచుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

- ఉపాధి హామీ పథకం ఏపీఓ రేఖా జ్యోతి
- పలు తండాల్లో ప్రధానమంత్రి జన్‌మన్ పథకం సభలు



హనుమాపురం తండాలో గ్రామ సభ



రామచంద్రాపురం తండాలో...

వెల్దుర్తి: చెంచు గిరిజనులను అభివృద్ధి పర్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి జన్‌మన్ పథకాన్ని తీసుకొచ్చారని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓ రేఖా జ్యోతి అన్నారు. బుధవారం మండలంలోని రామచంద్రాపురం, హనుమాపురం తండాలో జరిగిన జన్‌మన్ కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. ప్రధాన మంత్రి మోదీ చెంచు గిరిజనుల జీవితాలలో వెలుగులు నింపేందుకు ఈ కార్యక్రమాన్ని తీసుకురావటం జరిగిందన్నారు. ఈ పథకాల ద్వారా చెంచు గూడెంలో నివసిస్తున్న వారికి కావాల్సిన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టడం జరిగిందన్నారు. చెంచులకు నివాస స్థలంతో పాటు గృహాలు నిర్మించుకునేందుకు రూ. 2,39,000ను మంజూరు చేయటం జరిగిందన్నారు. గృహాలు నిర్మించుకునే వారికి ముందుగా లక్ష రూపాయలు వారి ఖాతాలలో జమ చేయటం జరుగుతుందన్నారు. చెంచు గూడెంలలో ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించాలని కోరారన్నారు. చెంచుల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలను గుర్తించి, వారి అభివృద్ధికి దోహదపడే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చెంచు గూడెంలలో కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రత్యేకంగా గ్రామ సభలను నిర్వహిస్తున్నామన్నారు. వారికి కావాల్సిన పథకాలను వారికి మంజూరు చేయించి వారి అభివృద్ధికి పాటుపడతామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం ఐటీడీఏ అధికారులు, డాక్టర్ థెరిస్సా, చెంచు గిరిజనులు పాల్గొన్నారు.

చెంచుల సంక్షేమం కోసం పీఎం జన్‌మన్ పథకం

మాచర్ల రూరల్: అడవితల్లిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న చెంచుల జీవనాభివృద్ధి కోసం ప్రధాన మంత్రి జన్‌మన్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్క చెంచు కుటుంబాలకు అందించి వారి అభివృద్ధికి పాటుపడాలని ఎంపీడీఓ కె.సరోజనీదేవి కోరారు. బుధవారం మండలంలోని తాళ్లపల్లి, పశువేముల గ్రామాలలో పీఎం జన్‌మన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చెంచుల జీవన విధానం, వారి వృత్తి సౌలభ్యం ప్రకారం వారికి ఆర్థికంగా చేయూతనందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందన్నారు. దీనిలో భాగంగా లబ్దిదారుల జాబితా తయారు చేసి అటవీ హక్కుల చట్టం ప్రకారం సాగుభూమి పట్టాలు అందించటం, నివాస గృహ స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి చేయూతనందించటంతో పాటు ఆధార్ కార్డులు, కమ్యూనిటీ సర్టిఫికెట్లు, బ్యాంకు ఖాతాలతో పాటు వారికి ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సీకిల్ సెల్ వ్యాధికి సంబంధించి స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. ముఖ్యంగా విద్యనభ్యసించే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, మెటర్నిటి బెనిఫిట్స్, రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు, కిసాన్ సమ్మాన్, వికలాంగులకు ధ్రువీకరణ పత్రాలు అందించనున్నట్లు తెలిపారు. వీటన్నింటి కోసం చెంచులు ప్రత్యేక కమిటీలుగా ఏర్పడి అధికారులను సంప్రదిస్తే వారికి నిర్ణీత సమయంలో పథకాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడతామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ అల్లి సురేష్, ఏఓ లక్ష్మారెడ్డి, డాక్టర్ వెస్లీ, ఈఓపీఆర్‌డీ కోటేశ్వరరావు, వీఆర్ఓ ఆరుమల్ల నాగేశ్వరరావు, కార్యదర్శి వెంకట్రామయ్య పాల్గొన్నారు.

కారంపూడి బస్టాండ్‌కు ఇక బస్సులు రావు

పిడుగురాళ్ల ఇన్‌ఛార్జి డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్

పిడుగురాళ్ల: కారంపూడి బస్టాండ్‌లోకి బస్సులు వెళ్లడాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్లు ఇన్‌ఛార్జి డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ తెలిపారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు... ప్రజల వినతి మేరకు కారంపూడి బస్టాండ్‌లోకి బస్సులను తీసుకొని వెళ్తున్నామని, కానీ బస్టాండ్ కారంపూడి గ్రామానికి 5 కిలోమీటర్ల దూరం ఉండటం, అక్కడ ప్రయాణికులు కూడా ముగ్గురు, ఇద్దరు ఎక్కుతున్నారని, కొన్ని సమయాల్లో వారు కూడా ఎక్కటం లేదని దీంతో ఆర్టీసీకి భారంగా మారుతుందని గమనించి, ఈ నిర్ణయం తీసుకున్నామని తెలియజేశారు. ప్రయాణికులు గమనించి ఆర్టీసీకి సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

పంట నమోదు తప్పనిసరి



పిడుగురాళ్లరూరల్: పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని ఏఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని జూలకల్లు గ్రామంలో పంట నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ...పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని, రైతులు ఈకేవైసీ కూడా చేయించుకోవాలని తెలిపారు. పంట నమోదు ఆఖరి తేదీ వచ్చే సెప్టెంబర్ నెల 15 తేదీ వరకు ఉందని తెలిపారు. దీని వలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రాయితీలను పొందవచ్చునని ఆయన తెలిపారు. క్షేత్రస్థాయిలోనే అధికారులు కూడా పంట నమోదును వేగవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు.

జైళ్ల శాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సత్తెనపల్లి: జైళ్ల శాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ జైళ్ల శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నంబుల విశ్వేశ్వరరావు కోరారు. బుధవారం రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితకు ఈ మేరకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న రిక్రూట్మెంట్, బదిలీలను జిల్లా స్థాయిలో జరిగేలా, పోలీస్ వారితో సమానంగా సంవత్సరానికి మూడు సరెండర్లు వచ్చేలా, అర్హులైన సిబ్బందికి సత్వర పదోన్నతులు ఇచ్చేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలను సావధానంగా విని అన్నిటికీ పరిష్కారానికి తగు చర్యలు తీసు కుంటానని హోం మంత్రి అనిత చెప్పినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

పంటకోత ప్రయోగాలపై అవగాహన

బెల్లంకొండ: ఖరీఫ్ 2024 సీజన్‌లో వివిధ పంటల పంట కోత ప్రయోగాల నిర్వహణపై వ్యవసాయ శాఖ సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి డి.కృష్ణయ్య తెలిపారు. మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో బుధవారం వివిధ గ్రామ సచివాలయాలలో పని చేసే గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకులు, బహుళ ప్రయోజన విస్తరణ అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పత్తి, వరి, నువ్వులు, మిరప, తదితర పంటలలో పంట కోత ప్రయోగాలకు సర్వే నంబరు ఎంపిక, సబ్ డివిజన్ ఎంపిక, ప్లాటు ఎంపిక తదితర అంశాలపైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సహాయ గణాంక అధికారి ఎం.అంజలి పాల్గొన్నారు.

స్థల పరిశీలన

పెదకూరపాడు: గిడ్డంగుల నిర్మాణానికి స్థలాన్ని తహసీల్దార్ దానియేలు బుధవారం పరిశీలించారు. కొన్ని సంవత్సరాలుగా గిడ్డంగులు అద్దెకు తీసుకొని నిర్వహిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గిడ్డంగులకు శాశ్వత భవనం నిర్మాణం కోసం సుమారు అర ఎకరం స్థలం పెదకూరపాడులో ని ఎస్సీ బాలిక వసతి గృహం పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు.